ప్రజాశక్తి

శుక్రవారం 20 జనవరి 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మచిలీపట్నంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ఎల్ఐసి ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించాలి

బీమా ఉద్యోగుల నిరసనల్లో నేతల డిమాండ్

జాతీయాకరణ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా), భవానీపురం (విజయవాడ), అవనిగడ్డ : ఎల్ఐసిని ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విరమించుకోవాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి పట్ల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా జీవిత బీమా జాతీయాకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మచిలీపట్నం, విజయవాడ, అవనిగడ్డల్లోని ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. మచిలీపట్నంలో ఐసిఇయు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో 'జాతీయ బీమా రంగాన్ని కాపాడుకుంటాం' అన్న నినాదంతో కూడిన బ్యాడ్జీలను ఎస్ఐసి ఉద్యోగులు (మిగతా 6లో)

విజయవాడ భవానీపురంలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసి సిబ్బంది

అధికారుల తప్పిదం

ఇ-క్రాప్, ఇ-కెవైసిలో సాధారణ రకం వరిగా ఎంటియు 1061 నమోదు

ప్రభుత్వ మార్గదర్శల ప్రకారం ఇది గ్రేడ్-ఎ రకం ❀ధాన్యం రైతులకు రూ.12.60 కోట్ల నష్టం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

కృష్ణాజిల్లాలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు చేసిన తప్పిదంతో ఎంటియూ 1061 వరిరకం గ్రేడ్-ఏ (ఫైన్ క్వాలిటీ) సాగు చేసిన రైతులు రూ.12.60 కోట్ల ఆదాయాన్ని కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇది గ్రేడ్-ఎ రకం ధాన్యం కాగా, క్వింటాల్‌కు రూ.2,060 చెల్లించాలి. కానీ, పౌరసరఫరాల శాఖ క్వింటాల్‌కు రూ.2,040 మాత్రమే చెల్లిస్తుండటంతో, ఎకరాకు రూ.600 చొప్పున రైతులు నష్టపోయారు. ఇ-క్రాప్ బుకింగ్, ఇ-కెవైసి సమయంలో ఎంటియు 1061 గ్రేడ్ రకం వరిని యాప్‌లో సాధారణ గ్రేడ్‌గా నమోదు చేశారు. ఫలితంగా రైతులు క్వింటాల్‌కు రూ.2,060కి బదులుగా రూ.2,040 పొందుతున్నారు. దీంతో కష్ణాజిల్లా రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా తమ వరి ధాన్యాన్ని విక్రయించి సుమారు రూ.12.60 కోట్లు నష్టపోయారు. అదేసమయంలో అదే రకం వరి ధాన్యాన్ని నాణ్యమైనదిగా పరిగణించి ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని రైతులకు క్వింటాల్‌కు రూ.2,060 ఇస్తోంది. ఈ-క్రాప్, ఈ-కేవైసీ రిజిస్ట్రేషన్ సమయంలో పొరపాటు జరిగిందని ఉన్నతాధికారులకు అధికారులు తెలిపినా ఎవరూ స్పందించకపోవడంతో ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. రైతులు తమది గ్రేడ్-ఎ రకం వరి అని, అది యాప్‌లో సాధారణ గ్రేడ్‌గా నమోదు చేశారని సంబంధిత అధికారులకు తెలిపారు. కానీ తాజాగా పౌరసరఫరాల శాఖ అధికారులు రైతులకు బిల్లుల చెల్లింపులు ప్రారంభించగా, క్వింటాలుకు రూ.20 నష్టపోతున్నట్లు గుర్తించారు. అనంతరం రైతులు ఈ సమస్యను పౌరసరఫరాల శాఖ అధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఈనెల 20 నుంచి ఎంటియూ 1061 రకం వరి ధాన్యాన్ని నాణ్యమైన (గ్రేడ్-ఏ)గా పరిగణించి క్వింటాల్‌కు రూ.2,060 చొప్పున రైతులకు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. అయితే ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ.20 నష్టం వాటిల్లిందని, దానిపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని విజయవాడ రూరల్, గన్నవరం మండలాలకు చెందిన పలువురు రైతులు వాపోయారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం కష్ణాజిల్లాలో ఎంటియూ 1061 వరి రకం దాదాపు 2.10 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సేకరణ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఎకరాకు 30 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తోందని వ్యవసాయ అధికారి ఒకరు తెలిపారు. పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం ప్రకారం 63 లక్షల క్వింటాళ్ల ఎంటియూ-1061 రకం వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,060 బదులు రూ.2,040 చెల్లిస్తుండడంతో కష్ణాజిల్లా రైతులు సుమారు రూ.12.60 కోట్ల మేర నష్టపోయినట్లు సమాచారం. ఈవిషయంపై కష్ణాజిల్లా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారి ఒకరిని వివరణ కోరగా, ఈ-క్రాప్ రిజిస్ట్రేషన్‌లో తలెత్తిన తప్పిదాన్ని ఆయన అంగీకరించారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి, తక్కువ వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే క్వింటాల్‌కు రూ.20 నష్టం వాటిల్లడంపైనా శాఖ కసరత్తు చేస్తోందని, ఆయా రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. రూ.12.60 కోట్ల మొత్తాన్ని సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు శాఖ ప్రయత్నిస్తోందని తెలిపారు.

సమాజాన్ని జాగృతం చేసిన వేమన

అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు

బహుమతులు అందిస్తున్న విజయబాబు, ఢిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తేటతెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో వేమన శతకాల ద్వారా సమాజాన్ని జాగ్రుతం చేశారని అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రజా కవి యోగి వేమన జయంతిని పురస్కరించుకుని విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో కలిసి విజయబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా విజయబాబు మాట్లాడుతూ వేమన పద్యాలు సామాజిక చైతన్యానికి నిదర్శనమన్నారు. సమాజంలోని సమస్యలను విభిన్న కోణాల్లో దర్శించి వాటి వైశిష్ట్యాన్ని పద్యాల రూపంలో ప్రజలకు అందించారన్నారు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరుతో జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించడం వంటి అనేక సామాజిక రుగ్మతలపై వేమన తన కలం ద్వారా వివరించారన్నారు. తన పద్యాల ద్వారా నీతిని చాటిచెప్పారన్నారు. మానవతా ధర్మం, సర్వ మానవ సమానత్వం, నైతిక విలువలు, మూఢనమ్మకాలు, సంఘ సంస్కరణలు, కుల విచక్షణలోని డొల్లతనం గుర్తించి తన పద్యాల్లో సూటిగా పొందుపరచిన మహా కవి యోగి వేమన అని కొనియాడారు. ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావుతో యోగి వేమన జీవిత చరిత్రను రాయించి కేంద్ర సాహిత్య అకాడమి 14 భాషల్లో అనువదింపజేసిందని, ఇంగ్లీషుతోపాటు ఐరోపా భాషలు, ద్రవిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువదించబడ్డాయని అన్నారు. తెలుగు భాషలోని ఏ కవికి ఇంతటి గౌరవం లభించలేదన్నారు. వేమన పద్యాలను నేటితరంలోని ప్రతి ఒక్కరూ చదివి వాటిలోని సారంశాన్ని తెలుసుకుని సామాజిక విలువలను కాపాడడంలో భాగస్వాములు కావాలని విజయబాబు (మిగతా 6లో)

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంబివికె బాధ్యులు బి.ఆర్.తులసీరావు

ప్రజాకవి...

ఎంబివికె బాధ్యులు బి.ఆర్.తులసీరావు

ప్రజాశక్తి - విజయవాడ : భారతీయ సాహిత్యంలో హేతువాద దృక్పధాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదట ప్రజాకవిగా వేమన ఖ్యాతిగాంచారని పలువురు నేతలు పేర్కొన్నారున. జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరిగిన వేమన జయంతి సభలో ఎంబివికె బాధ్యులు బి.ఆర్.తులసీరావు మాట్లాడుతూ (మిగతా 6లో)

గనుల శాఖ విభజన పూర్తి

త్వరలో మచిలీపట్నంలో ఎడి కార్యాలయం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

గనులు, భూగర్భ వనరులశాఖ జిల్లా కార్యాలయాలు విభజన పూర్తయింది. కృష్ణా జిల్లా పునర్విభజన తర్వాత ఎన్‌టిఆర్ జిల్లాకే పరిమితమైన రెండు ఎడి కార్యాలయాల్లో ఒక కార్యాలయాన్ని కృష్ణాజిల్లాలో ఏర్పాటు చేయనున్నారు. అయితే కార్యాలయాల సిబ్బంది విభజనపై స్పష్టత రావాల్సి ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడ, నందిగామ కేంద్రాలుగా గనులు, భూగర్భ వనరులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) కార్యాలయాలున్నాయి. జిల్లా పునర్విభజన జరిగిన తొమ్మిది నెలల తర్వాత ఈ శాఖను విభజిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విజయవాడలో ఉన్న ఎడి కార్యాలయాన్ని యథాతథంగా కొనసాగిస్తోంది. నందిగామలో ఉన్న కార్యాలయాన్ని కృష్ణాజిల్లాలో ఏర్పాటు చేయాలని ఉత్తర్వులిచ్చింది. ఈ కార్యాలయాన్ని త్వరలో కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఏర్పాటు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఆయా కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది విభజనపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది. జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అధికంగా ఉన్నాయి. మార్గదర్శకాలకు అనుగుణంగా రీచ్‌లలో ఇసుక, బుసక తవ్వకాలకు, వ్యవసాయ భూముల్లో మెరక తొలగింపులో భాగంగా మట్టి తవ్వకాలకు, గన్నవరం ప్రాంతంలోని ఎర్రమట్టి నేలలు, గుట్టలకు సంబంధించిన మైనింగ్ అనుతులు ఇవ్వడంలో మచిలీపట్నంలో ఏర్పాటయ్యే గనులశాఖ కార్యాలయం కీలకం కానుంది.

మార్చి 15 వరకు ధాన్యం సేకరణ

మంత్రులు కారుమూరి, జోగి

ప్రజాశక్తి - విజయవాడ : రైతుల వద్ద నుంచి మార్చి 15వ తేదీ వరకూ ధాన్యం సేకరణ చేస్తామని రాష్ట్ర గహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. ధాన్యం సేకరణపై గురువారం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి పాల్గొని కష్ణాజిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణపై మాట్లాడారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి జోగి రమేష్‌తోపాటు మాజీ మంత్రి, మచిలీపట్టణం శాసన సభ్యుడు పేర్ని నాని, వ్యవసాయ మిషన్ చైర్మన్ నాగి.రెడ్డి, కష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పోరాసరఫరాల సంస్థ కమిషనర్ కే.అరుణ్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జీ.వీర పాడ్యన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు కనీస మద్దతు ధర లభిస్తుందని, రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతందని మంత్రి స్పష్టం చేశారు. కష్ణా జిల్లాలో సుమారు 5,06,200 టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంకాగా, ఇంతవరకు 3,18,554 టన్నులు సేకరించారని తెలిపారు. ఇంతవరకు రూ.517.42 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని అధికారులు మంత్రి దష్టికి తీసుకోచ్చారు. జిల్లాలోని 316 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతోందని వివరించారు. ఈసమావేశంలో కష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

దేవినేని ఉమా హౌస్ అరెస్ట్

- భారీగా మోహరించిన పోలీసులు
- టిడిపి కార్యాలయం తొలగింపు

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : గొల్లపూడిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావును గురువారం హౌస్ అరెస్ట్ చేశారు. ఇక్కడి తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి సంబంధించిన లీజుపై వివాదం జరుగుతోంది. లీజుదారుడు ఆలూరి చిన్నా, ఆయన కుటుంబ సభ్యుల మధ్య గొడవ తలెత్తడంతో హైకోర్టులో కేసు విచారణ జరుగుతోంది. స్థల వివాదాన్ని పరిష్కరించుకోవాలని ఆలూరి చిన్నా కుటుంబ సభ్యులకు డిసెంబరు 28న తహశీల్దార్ నోటీసులిచ్చారు. కాగా పార్టీ కార్యాలయాన్ని అధికారులు, పోలీసులు తొలగించారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే అధికారులు, పోలీసులు స్థానిక టీడీపీ కార్యాలయాన్ని తొలగించారు. పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు, ఫర్నిచర్, కంప్యూటర్లను తరలించారు. పార్టీ కార్యాలయానికి బొమ్మసాని సుబ్బయ్యచౌదరి కాంప్లెక్స్ అని బోర్డు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఆనుకొని కూర్చునే పసుపురంగు బల్లలు సైతం తొలగించారు. టీడీపీ కార్యాలయం వైపు ఎవరూ రాకుండా ముందస్తుగా నియంత్రణ చర్యలు చేపట్టారు. బారికేడ్లు పెట్టి ఎవరినీ అనుమతించడంలేదు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు అక్కడకు చేరుకొని నిరసన తెలియజేశారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి ఆయన్ను బయటకు రానివ్వకుండా చూశారు. దీనిపై మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కళ్లల్లో ఆనందం చూడటానికే పోలీసులు టీడీపీ కార్యాలయాన్ని కూల్చడం వంటి పనులు చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని మండిపడ్డారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల : రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కంచికచర్లలో జాతీయ రహదారి పక్కన గల వ్యాపారస్థులను కలుసుకున్నారు. వ్యాపార లావాదేవీలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో పెన్షన్ కావాలన్నా జన్మభూమి కమిటీ సిఫార్సు ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్ పాలనలో సమూల మార్పులు తీసుకు వచ్చి, ప్రభుత్వ పథకాలు అందాలంటే అర్హత ఒక్కటే ప్రామాణికంగా పెట్టుకొని, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, కార్యదర్శి కనగాల రవికుమార్, ఆర్ఐ శిరీష, యంపిడీఓ కె బాల శంకరరావు, వైసిపి నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, నారిశెట్టి శ్రీనివాస్, వంగా శ్రీనివాసరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : దేశ, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా వారోత్సవాల ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు జగ్గయ్యపేట మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ యం రవికుమార్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా గురువారం వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లోడ్డు, ఓవర్ లోడ్ రన్నింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటుందన్నారు. లైసెన్స్ గాని, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ గాని, పొల్యూషన్ గాని లేకపోతే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం నుండి గాని, ఇన్సురెన్స్ కంపెనీల నుండి నష్ట పరిహారం అందవని ఆయన తెలిపారు. రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పిస్తున్నప్పటికి వాహనదారులు సరైన నిభందనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. జగ్గయ్యపేట సిఐ ఏ నాగమురళీ, యస్ఐ రామారావు, సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ ఆలాం, కానిస్టేబుల్ యన్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ :** వాహనాలకు, వాహనాలు నడిపేవారికి ఇన్సూరెన్సు , లైసెన్సు తప్పనిసరి అని నందిగామ ఆర్‌టిఓ ఎం.పద్మావతి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా రెండోరోజు గురువారం నందిగామ ఆర్డిఓ కార్యాలయం వద్ద వాహన యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న నందిగామ ఆర్‌టిఓ పద్మావతి మోటారు వాహన చట్టం 2019లో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణరలపై ఇన్సూరెన్సు లైసెన్సు రిప్రెంజెటివ్లతో అవగాహన కల్పించారు. వాహనాలు రోడ్డుపై నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన రికార్డులు పోర్సులో ఉంచుకోవాలని కోరారు. లేని యెడల 2019 మోటారు చట్టంలో ఫైన్ పెంచారని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు శిక్ష పడేలా చేశారని తెలిపారు. ఇన్సూరెన్సు రిప్రజెంటివ్ పిచ్చేశ్వరరావు, నందిగామ సిఐ కె సతీష్, పరిపాలన అదికారి ప్రభాకర్ లింగం పాల్గొన్నారు.

పదివేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-గుడివాడ : శాతం నిమిత్తం అన్నదానం కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమాని వైకాపా రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యలయం ఎదురుగా ఉన్న రామలమం వద్ద భారీ అన్నసమారధన వైకాపా రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ ప్రారంభించారు. శాంతి నిమిత్తం అన్నదాన సుమారు 10వేల మందికి అందిచడం గొప్ప విషయమన్నారు. వైకాపా పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, లారీ అసోసియేషన్ నాయకులు గుత్తా శివ రామకృష్ణ (చంటి), ఉత్సవ కమిటీ కన్వీనర్ డొక్కు రామచంద్రరావు (రాంబాబు) పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యాన మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో గురువారం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి పెద్దపొంగు లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ దళిత, గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యాన వివిధ రూపాల్లో మహత్తరమైన పోరాటం చేసి సాధించుకున్న ఎస్ సి, ఎస్ టి సబ్ ప్లాన్ చట్టం 2023 జనవరి 23తో ముగుస్తుందని, దానిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల ఉద్యమ ఫలితంగా వచ్చిన చట్టాన్ని కొనసాగించాలని, శ్వాశతంగా కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని కొనసాగించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడానికి దళిత, గిరిజనుల సమస్యలు చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం కొనసాగించకపోతే అన్ని సంఘాలను కలుపుకుని ఐక్య కార్యాచరణ ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల మండల అధ్యక్షులు ఆధిమళ్ళ నాగేష్, ఎస్ సి నాయకులు బి గురు ప్రసాద్, టి వెంకట రత్నం, బి బ్రహ్మం, పి పున్నయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

గొల్లపూడిలో రహదారులు మూసివేయడం అమానుషం

- మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ : గొల్లపూడిలో రహదారులు మూసివేయడం అమానుషం అని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విమర్శించారు. పట్టణంలోని కాకానినగర్‌లో తంగిరాల సౌమ్య తన కార్యాలయంలో గత రెండు రోజులుగా గొల్లపూడిలో జరుగుతున్న పరిణామాలపై ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి కార్యాలయ మార్గాలను మూసివేసిన అధికారులు ఎందుకు మూసివేశారో నోరువిప్పి సమాధానం చెప్పాలన్నారు. టీడీపీ కార్యాలయం కూల్చివేత వెనుక దాగి ఉన్న కుట్రను బయటకు చెప్పాలన్నారు. లీజుదారుడు, కుటుంబసభ్యుల మధ్య వివాదం, లీజు వివాదంపై హైకోర్టులో విచారణ కొనసాగుతున్నదని, హై కోర్ట్ విచారణలో ఉన్న స్థలంపై పోలీస్, రెవిన్యూ శాఖ వారు ఎందుకు జ్యోకం చేసుకుంటున్నారని తెలిపారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ఈనెల 24వ తేదీన జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని చిల్లకల్లు గ్రామంలో మహిళా గ్రామసభ నిర్వహించారు. దీనిలో భాగంగా ఐసిడిఎస్ ఎసిడిపిఓ కె గ్లోరి బాల్యవివాహాలు, లింగవివక్షత, మహిళలపై హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు మొదలగు విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ మరియు తల్లులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని పాత బైపాస్ రోడ్ లో గల "గిల్గాల్ ప్రేయర్ చర్చి" నందు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, దైవ సేవకులు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేమనకు ఘన నివాళి

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంధాలయంలో గురువారం యోగి వేమన జయంతి ని విద్యార్థులు, పాఠకులతో కలిసి అధి కారులు ఘనంగా నిర్వహించారు. వే మన చిత్ర పటానికి పూలమాలేసి ని వాళ్లర్పించారు. వేమన జీవిత విశేషా లను పాలకురాలు పద్మ వతి వివరిం చారు. ఈసందర్భంగా విద్యార్థులకు వేమన నీతిపద్యాలు పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.

వైయస్సార్ బీమా నగదు అందుచేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని క్రిస్టియనపేటకు చెందిన రూంజ నాగయ్య అనారోగ్య కారణముతో మృతి చెందగా ముందుగా మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్ఆర్ భీమా కింద మంజూరైనా 10000 రూపాయలను మృతుడు నాగయ్య భార్య హైమవతి కి గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్స్ సురేష్, ఇన్నమ్మ, వెల్ఫేర్ శ్యామ్, వాలంటీర్ మరియు వైస్సార్సీపీ నాయకుడు పిడతల జయరాజు పాల్కొన్నారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు సబ్ ఇన్స్పెక్టర్ గా ఇప్పటివరకు విధులు నిర్వహించిన సిహెచ్ చినబాబు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనకు గురువారం చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కె.దుర్గాప్రసాద్ సబ్ ఇన్స్పెక్టర్ గా చిల్లకల్లు రానున్నారు. హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య కానిస్టేబుల్ వెంకట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలనే

ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు

- ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలనే ఉద్దేశంతోనే ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం నందిగామలో పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ సెంటర్ ముగింపు సభలో ఉచిత కోచింగ్ సెంటర్ లోని విద్యార్థులకు పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష హాల్ టికెట్లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో జరగబోయే ప్రిలిమ్స్ పరీక్షలలో విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించి తదుపరి పరీక్షలకు అర్హత పొందేలా వారికి ప్రఖ్యాత పిజెఆర్ కోచింగ్ సెంటర్ తో సిబ్బందితో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ తన మాతృమూర్తి కస్తాల మరియమ్మ ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఆమె కుమారులైన మమల్ని ఉన్నతంగా చదివించి ఉద్యోగాలతో మా భవిష్యత్తును తీర్చిదిద్దిందని, ఆమె స్ఫూర్తితోనే నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాల కల్పన చేయాలని కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయాలకు, కులమతాలకు, పార్టీలకు అతీతంగా కోచింగ్ సెంటర్ నిర్వహణ కూడా కెవిఆర్ కళాశాల అధ్యాపకులు వాసుదేవ రావు చేత అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగిందన్నారు. నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం, రాష్ట్ర నాయకులు కోవెలమూడి వెంకట నారాయణ, కో ఆప్షన్ సభ్యులు దాసు,కోటేరు ముత్తారెడ్డి,వాసుదేవరావు, ఉలవలపూడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

- ఎపిఎస్ఆర్‌టిసి ఎం.డి ద్వారకా తిరుమలరావు

పనుల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న తిరమలరావు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యమని ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం మచిలీపట్నం ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో ప్రాంగణాన్ని పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. డిపోలో డిస్పెన్సరీ సందర్శించారు. డిపో మేనేజర్ పెద్దిరాజులు డిపోలో ఆర్టీసీ కార్యకలాపాలు ఎండీకి వివరించారు. డిపోలోని సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందరు డిపోను రూ. 3.50 కోట్లతో విస్తరణ, అభివద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రాంగణంలో వాడుకలో లేని ఉద్యోగుల నివాసాలు వాడుకలోకి తేవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ కారణంగా నిలిచిన డిపో విస్తరణ, ప్లాట్ ఫారం విస్తరణ పనులు మొదలు పెట్టినట్లు మార్చి ఆఖరు నాటికి పూర్తిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. డిస్పెన్సరీ పల్లంలో ఉన్నందున రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దానిని మార్చే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ స్థలాలు ప్రైమ్ లొకేషన్లో ఉన్నాయని, వాటిని పరిరక్షించుకుంటూ, దీర్ఘకాలిక లీజులకు ఇవ్వడం, మైలేజీ పెంచుకోవడంతో ఆర్టీసీ ఆదాయాన్ని పెంచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు కె.బ్రహ్మానందరెడ్డి, గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి గద్దె నాగేశ్వరరావు, ఈఈ రాజశేఖర్, డిఈ జగదీష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. అప్పారావు, డా. విజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు:

2020 జనవరి 1 నుండి ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిందని అన్నారు. దీంతో వివిధ ప్రభుత్వ శాఖల మాదిరిగా ఆర్టీసీ ఉద్యోగులకు కూడా కారుణ్య నియామకాలు వర్తిస్తాయని సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు కారుణ్య నియామకాలు చేస్తున్నట్లు, గత 45 రోజులుగా 332 మందికి కారుణ్య నియామకాలు చేసినట్లు ఈ సంధర్బంగా తెలిపారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-కోడూరు : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానానికి చేరుకుంటారని కోడూరు మండల తహసీల్దార్ లతీఫ్ పాషా అన్నారు. యంపియుపి స్కూల్ కోడూరు ను గురువారం సాయంత్రం తహసీల్దార్ సందర్శించారు. పిల్లలకు జగనన్న గోరుముద్ద నూతన మెనూ అమలును పరిశీలించారు. నాణ్యతతో కూడిన మెనూ అందచేస్తున్న ఒదుకు ప్రశంసించారు. సమ్మేటివ్ పరీక్షలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు జీవితంలో గొప్పలక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రతిరోజూ క్రమపద్ధతితో చదవాలని పిల్లలకు ప్రేరణ కలిగించారు. మొబైల్ ఫోన్లకు పిల్లలు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని వెలివోలు గ్రామానికి చెందిన బొల్లా శ్రీనివాసరావు పూరిల్లు విద్యుత్ ఘాతంతో గురువారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 1,85,000 నగదు, 16 గ్రాముల బంగారం, గృహొపకరణములు కాలి బూడిద అయ్యాయి. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్న సమయానికి ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్ఎఫ్ఐ ఉయ్యూరు మండల కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్థానిక ఉయ్యూరు నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఉయ్యూర మండల మహాసభ గురువారం జరిగింది. ఈ సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ పాల్గొని మాట్లాడతూ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ రద్దు చేయాలని, ప్రతి ఒక్కరికి ఉచిత విద్య అందించాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి ఒక్కరికి అమ్మవాడిని దీవెన విద్య దీవిన అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఈదుల ప్రేమ్ కుమార్, కార్యదర్శిగా కన్నెపోగు సాయి, 21 మంది సభ్యులతో మండల కమిటీ ఏర్పాటు చేశారు. సభ్యులుగా దీపక్ , మొబిన్, పవన్, స్నేహిత్, హేమంత్ ,దయాకర్, రాజేష్, హర్ష జోసెఫ్ ,గోపాలకష్ణ, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సమరం, కష్ణాజిల్లా డివైఎఫ్ఐ కన్వీనర్ బాజీ బాబు తెల్లాకుల పాల్గొన్నారు.

సమిష్టి సహకారంతోనే సహకార సంఘాల అభివృద్ధి

ప్రజాశక్తి-చల్లపల్లి : సంఘ సభ్యుల సమిష్టి సహకారం తోనే సహకార సంఘాలు అభివృద్ధి చెందుతాయని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య అన్నారు. మండల పరిధిలోని మంగళాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో సొసైటీ నిర్మాణనికి స్థలదాత పరుచూరి కోటయ్యా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రావుల వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ చిత్తశుద్ధి నీతి నిజాయితీ గలవారు సహకార వ్యవస్థలకు చైర్మన్లుగా ఉన్నప్పుడే సహకార సంఘాలు బలోపేతం అవుతాయని అన్నారు. సొసైటీ చైర్పర్సన్ పేరం నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, ఎంపీటీసీ పిట్టు వెంకటేశ్వరమ్మ, పాలకేంద్రం అధ్యక్షులు పరిసే నాంచారయ్య, పిఎసిఎస్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో, బైకు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి-మచిలీపట్నం జాతీయ రహదారి-216పై బైకు-ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడిన ఘటన గురువారం మండల పరిధిలోని కొత్త మాజేరు వద్ద జరిగింది. మచిలీపట్నంకు చెందిన వేముల వెంకటేశ్వరరావు, వేముల దీపిక, కార్తీక్ తెనాలిలో బంధువుల ఇంటికి వెళ్ళి బైకుపై వస్తుండగా మచిలీ పట్నం నుండి చల్లపల్లి వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవరుతో సహా బైక్‌పై వస్తున్న వారు గాయపడగా మోపిదేవి 108 అంబులెన్సు సిబ్బంది మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు.

కృష్ణా వర్సిటీలో వేమనకు ఘన నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : యోగి వేమన జయంతిని పురస్కరించుకొని కృష్ణా యూనివర్సిటీలో వేమన చిత్ర పటానికి కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ కే. రామ మోహనరావు పూలమాలలను అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సెలర్ మాట్లాడుతూ యోగి వేమనను ప్రజాకవి, తత్వవేత్తగా అభివర్ణించారు. తేలికైన పదాలతో అనుభవాలకు పద్య రూపం కల్పించిన గొప్ప కవి వేమన అని తెలిపారు. సుమారు 5000 పద్యాలకు పైగా రచించిన యోగి వేమన ప్రతి పద్యంలో సమాజానికి నీతిని అందించిన మహనీయుడు అని కొనియాడారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామిరెడ్డి మాట్లాడుతూ సమాజం లోని అన్ని కోణాలను స్పృశించిన గొప్ప కవి యోగి వేమన అని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ కు ప్రశంసా పత్రాలు

కర్నాటకలో హుబ్లీ - దార్వాడ్‌లో జరిగిన 26వ జాతీయ యువజన ఉత్సవాలలో పాల్గొన్న యూనివర్సిటీ తరపున పాల్గొన్న ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్స్ శశి ప్రణీత్ రెడ్డి, అరుణ్ సందీప్,విజయ్,గౌరీ ప్రియ, మేఘన తమ ప్రశంసా పత్రాలతో వైస్ ఛాన్సెలర్ రామమోహనరావుని కలిశారు. వారిని వైస్ ఛాన్సెలర్ అభినంధించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-ఉయ్యూరు : జీవితంలో ప్రతి ఒక్కరూ జీవితంలో లక్ష్యాలు ఏర్పరచుకొని వాటిని సాధించిన దినాలను జీవితంలో విజయోత్సవ దినాలుగా జరుపుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ అన్నారు. ఉద్యోగంలో చేరి 21 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా. చల్లపల్లిలోని సీయోను వద్ధాశ్రమంలో సురేష్ బాబు గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.భాస్క రరావు, మేడేపల్లి సుబ్బారావు, జి.కోటేశ్వరరావు, ఆశ్రమం నిర్వాహకులు శీలం భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు, స్వయం సహాయక సంఘాలకు ఉపాధి

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కంకిపాడు : వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల అమలులో స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులకు పాడి గేదలను పంపిణీ చేసి ఆర్థిక పరిపుష్టిని కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన రైతులకు స్వయం సహాయక సంఘాల మహిళలకు గురువారం కంకిపాడు మార్కెట్ యార్డు నందు జిల్లా కలెక్టర్ డిల్లీరావు పాడిగేదలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో నాలుగు వేల మంది లబ్దిదారులకు పాడిపశువులను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. జనవరి మాసాంతానికి రెండువేల మంది లబ్ధిదారులకు పాడి పశువులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఫిబ్రవరి మాసాంతానికి నాలుగు వేల పాడి పశువులను పంపిణీ చేసే లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. లబ్ధిదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ విద్యాసాగర్, జడ్పిటిసి బి. కోటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల కలెక్షన్ పాయింట్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి విద్యుత్ శాఖ కార్యాలయంలో బిల్లులు కట్టించుకునే కలెక్షన్ పాయింట్ తిరిగి పునరుద్ధరించారు. గతంలో చల్లపల్లి విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న కలెక్షన్ పాయింట్ లో స్థానిక ప్రజలతో పాటు చల్లపల్లి వచ్చిన ఇతర గ్రామస్తులు సైతం బిల్లులు చెల్లించేవారు. గ్రామ సచివాలయంలో విద్యుత్ బిల్లులు చెల్లించటం, ఆన్ లైన్ సేవలు విస్తృతం చేసే క్రమంలో ఇటీవల కలెక్షన్ పాయింట్ నిలుపుదల చేశారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు విద్యుత్ శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి కలెక్షన్ పాయింట్‌ను పునరుద్ధరించాలని సూచించటంతో అధికారులు స్పందించి మళ్లీ కలెక్షన్ పాయింట్ గురువారం ఏర్పాటు చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ఉప్పలపాటి శ్రీనివాస రావుకు చెందిన పూరిల్లు మంగళవారం అర్ధరాత్రి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కోడూరు లోని వాసవి క్లబ్ కపుల్స్ వారు గురువారం అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి బిపిటి బియ్యం కట్ట, నిత్యవసర సరుకులు, కూరగాయలు, వంట సామాగ్రి, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కపుల్స్ కోడూరు సెక్రటరీ అరవపల్లి బుజ్జి, ట్రెజరర్ కోడూరు సత్యనారాయణ, వాసవి క్లబ్ కపుల్స్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో సర్వస్వం కోల్పోయిన ఉప్పలపాటి శ్రీనివాసరావు కుటుంబాన్ని శ్రీరామ వెల్ఫేర్ సోసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎంపిటిసి తిమ్మన నాంచారయ్య, కోడూరు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బడే కష్ణ, మెరుగు మల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు : రావి

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను చెడ గొట్టేందుకు పెయిడ్ ఆర్టిస్టు లతో కొడాలి నాని కవ్వింపు చర్యలకు పాల్పడడం అతని నీచస్థితికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ మాజీ మంత్రి కొడాలి నాని ఒక పక్క జూనియర్, మరోపక్క సీనియర్ ఎన్టీఆర్‌లను, వంగవీటి రంగాలను అవసరమైనప్పుడు వారి ఫోటోలతో మళ్లీ ప్రజలను మాయచేసేందుకు సిద్ధమైయ్యాడని విమర్శించారు. ప్రజల సమస్యలు గాలికి వదిలి, జేబు నింపుకుంటున్న కొడాలి నానికి చావు దెబ్బ తప్పదని హెచ్చారించారు.

పాత మస్తర్ విధానాన్నే కొనసాగించాలి

విఎంసి కమిషనర్‌కు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, కార్మికులకు పాతపద్ధతిలోనే ఎఫ్‌ఆర్‌ఎస్ మస్తర్ విధానాన్ని కొనసాగించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జ్యోతిబాస్, ఎం.డేవిడ్ గురువారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా అమలు చేస్తున్న ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టమ్ వల్ల (ఎఫ్‌ఆర్‌ఎస్) వందలాది మంది ఉద్యోగ, కార్మికులు ప్రధాన కార్యాలయానికి రావడం వల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు సుదూర ప్రాంతాల నుంచి ప్రధాన కార్యాలయానికి ఉదయం, సాయంత్రం మస్తర్ కోసం రావాల్సి వస్తోందన్నారు. విధుల్లో నుంచి కార్యాలయానికి రావాలన్నా, అక్కడ నుంచి ఇళ్లకు చేరాలన్నా తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. దీని వల్ల పనులపై ప్రభావం పడటం, ప్రయాణాలకు వందల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. అత్యధికంగా ఉన్న మహిళా కార్మికుల అవస్థలు వర్ణనాతీతమన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్... పాత విధానంలోనే మస్తర్ వేసే విధంగా అధికారులకు ఆదేశాలిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే దీనిపై ప్రజారోగ్య విభాగం అధికారులను కూడా పిలిపించి మాట్లాడామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నగర కార్యదర్శి టి.చిన్న, వి.సాంబులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

22వ డివిజన్‌లో నిరసన

ఎపి ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని వెంటనే నిలుపుదల చేసి, పాత పద్ధతిలోనే మస్తర్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ కృష్ణలంక 22వ డివిజన్ సచివాలయం సెంటర్‌లో మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు నిరసన తెలిపారు. పాత విధానాన్ని అమలు చేయాలని, కొత్త విధానాన్ని రద్దు చేయాలని, అధికారుల వైఖరి నశించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్ మాట్లాడారు.

నిమ్రాలో పవర్‌లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళల పవర్ లిఫ్టింగ్ పోటీలు నిమ్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విజయవాడ వారి ఆధ్వర్యంలో గురువారం సెలక్షన్స్ ట్రైల్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో నిమ్రా విద్యార్థినులు షేక్ ఆసియా 63 కేజీల విభాగంలో, ఆర్.వందన 57 కేజీల విభాగంలో అర్హత సాధించినట్లు కళాశాల డీన్ ఎమ్ఎస్ పారుఖ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 9 నుండి 12 వరకు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. అర్హత సాధించిన క్రీడాకారిణులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి, వ్యాయమ అధ్యాపకులు యమ్ఎస్ ఖాన్, సెలక్షన్స్ కమిటీ సభ్యులు షేక్ సుభాని పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణే లక్ష్యం

ప్రకాశక్తి-మైలవరం: కుష్టు వ్యాధి నివారణే ప్రభుత్వ లక్ష్యమని స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవాసాగర్ అన్నారు. గురువారం మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటా సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి, టీబి, కేన్సర్ వంటి వ్యాధులను గుర్తించి నిరోధానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. వ్యాధిని ఆరంభ దశలోనే గుర్తిస్తే వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చునన్నారు. సిబ్బందికి వ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి-భవానీపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పొన్నగంటి రామమోహనరావు (42) మైలవరంలోని చంద్రగూడెంలో నివాసం ఉంటూ టాటా ఏసి డ్రైవర్‌గా విజయవాడ నుంచి కూరగాయలు తీసుకెళ్తాడు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి రాజీవ్ గాంధీ పార్కు వెనకాల వున్న కూరగాయల మార్కెట్‌కు బయలువేరి వచ్చాడు. అర్ధరాత్రి 12 దాటిన తరువాత రామమోహనరావు ఫోన్ నుండి ఎవరో వ్యక్తి ఫోన్ చేసి గొల్లపూడి అయ్యప్ప స్వామి గుడి దాటిన తరువాత ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొని చనిపోయి ఉన్నాడని తెలిపారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి బ్యానర్ల తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా టిడిపి, ఆ పార్టీ అభిమానులు కట్టుకున్న బ్యానర్లు తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి చెప్పారు. నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)తో కలిసి మాట్లాడారు. అంతకు ముందు ఎసిజి, సిటీ ప్లానర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికార వైసిపి కక్ష గట్టి టౌన్‌ప్లానింగ్ అధికారులతో టిడిపి బ్యానర్లను తొలగించిందన్నారు. రెండు , మూడు మాసాల నాడు కట్టిన వైసిపి బ్యానర్లను తొలగించకుండా, తమ బ్యానర్లను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు.

23 నుండి 'శుభస్యశీఘ్రం'

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ప్రేక్షకులకు ఎప్పటికపుడు వినోదభరితమైన కార్యక్రమాలను అందిస్తున్న జీ తెలుగు ఆధ్వర్యంలో ఈనెల 23 నుండి శుభస్య శీఘ్రం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నట్లు ఛానల్ ప్రతినిధి రామ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సరికొత్త కథాంశంతో ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని అందిస్తున్న జీ తెలుగు వినూత్న కార్యక్రమం అందిస్తుందని ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాలన్నారు. 23వ తేదీ నుండి రాత్రి 7 గంటలకు ఈ కార్యక్రమం ప్రసారమవుతుందని తెలిపారు.

'26న ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలి'

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఆలిండియా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జెఏసి ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం కార్యదర్శులు పివి ఆంజనేయులు, ఎం.యలమందరావు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం వెలగా లక్ష్మణరావు భవన్‌లో ర్యాలీకి సంబంధించిన గోడపత్రికను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పంటలకు స్వామినాధన్ కమిషన్ చేసిన సూచన ప్రకారం మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలన్నారు. రైతులు, కౌలురైతుల రుణాలు రద్దు చేయాలని, మోటార్లకు మీటర్లు బిగించడాన్ని విరమించుకోవాలని, సమగ్ర పంటల భీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లారీ యజమానుల నిరసన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామలో గురువారం లారీ యజమానులు, డ్రైవర్లు నిరసన తెలిపారు. గ్రీన్ టాక్స్ పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలలో డీజిల్ ధరలకు, మన రాష్ట్రంలో డీజిల్ ధరలకు చాలా వ్యతాసం ఉందన్నారు. డీజిల్ లీటరుకు ఏడు నుండి 12 రూపాయలు వ్యతాసం ఉందన్నారు. సిఎం జగన్ పెట్రోల్, డీజిల్ ధరలపై అదనంగా సెస్సు పెంచి రవాణా రంగంపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వైఎస్ బాబు, నాయకులు తాటి పిచ్చయ్య, జమ్ముల సతీష్, రమేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఐఒసిలో భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: పారిశ్రామికవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్‌లో భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కంపెనీలో ట్రైల్ రన్ సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ఆయిల్ ట్యాంకర్‌లో ప్రమాదం సంభవి స్తే నివారణ ఎలా చేయాలనే అంశాలను వివరించారు. ఫోమ్ మరియు నీటితో ప్రమాదాన్ని ఎలా నివారించవచ్చో ట్రైల్ రన్ ద్వారా వివరించారు. రానున్న వేసవిలో ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయడానికి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కంపెనీ అధికారులు తెలిపారు.

వైవిరావు ఎస్టేట్లో అక్రమ కట్టడాలు?

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వైవిరావు ఎస్టేట్‌లోని కట్టడాలపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొండపల్లి నడిబోడ్డులో విజయవాడ-భద్రాచలం జాతీయ రహదారి పక్కన ఉన్న సుమారు 25 ఎకరాలు కబ్జాకు గురైందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్టేట్‌లో కొండరాళ్లతో చుట్టూ ప్రహరీని నిర్మించారు. ఇది అక్రమంగా నిర్మించారని స్థానికులు అంటున్నారు. ఇది ఉషా కార్డియాక్ సెంటర్‌కు చెందిన స్థలమంటూ కొందరు చెబుతున్నారు. దీనిపై అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్థలం రెవిన్యూ శాఖకు సంబంధించినదా లేక పురావస్తు శాఖకు సంబంధించినది అనే విషయంలో అధికారులు స్పందించి స్థానికుల అనుమానలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. ఈ స్థలంలో పురావస్తు కట్టలను కూడా కూల్చి గోడ నిర్మాణం చేపట్టినట్లు పలువురు చెబుతున్నారు. 25 ఎకరాలకు చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ వివాదానికి అధికారులు, యాజమానులు తెరదించాలని సిపిఎం కొండపల్లి పట్టణ నాయకులు ఎం.మహేష్ డిమాండ్ చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని స్థానికులు అంటున్నారని, ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఎలా వెళ్లిందో తెలియజేయాలని, ఎంత ప్రైవేట్ భూమి ఉందో ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి చెందిన కొండపల్లిలో పురావస్తు కట్టలను కాపాడలేని దుస్థితిలో పురావస్తు అధికారులు ఉండటం దారుణమన్నారు.

వైవిరావు ఎస్టేట్

నేటి నుండి ఆహ్వాన నాటిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: సుంకర టి కృష్ణ మెమోరియల్, నాగార్జున కళా పరిషత్ కొండపల్లి వారి నిర్వహణలో 15వ ఆహ్వాన నాటిక ప్రదర్శనలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు కొండపల్లిలోని రవీంద్రభారతి స్కూల్ ఆవరణలోని నాగార్జున కళాపరిషత్ ప్రాంగణంలో జరుగనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షులు లయన్ దేవినేని కిషోర్‌కుమార్ తెలిపారు. మొదటిరోజు శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభ కార్యక్రమానికి రమేష్ హస్పటల్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ ఎంసిదాస్, ప్రముఖ సినీనటులు జీవా ముఖ్యఅతిధులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. మొదటి నాటకం మల్లాది క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమెరికా అల్లుడు నాటిక, ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ చిలకలూరిపేట వారి ఆలితో సరదాగా నాటిక ప్రదర్శించబడుతుందని తెలిపారు. 21న కళాంజలి హైదరాబాద్ వారి మనిషి మంచోడే నాటిక, యంగ్ థియేటర్స్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి అనుకున్నది ఒకటి అయ్యింది ఇంకొకటి నాటిక, 22న పండు క్రియేషన్స్ కొప్పోలు ఒంగోలు వారి పక్కింటి మొగుడు నాటిక ప్రదర్శన అనంతరం ముగింపు సభలో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కళాభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పారిశుధ్య కార్మికునికి సన్మానం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్న వీరా రాఘవులును గురువారం మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సన్మానించి, దుస్తులు బహుకరించారు. సంక్రాంతి పండుగ రోజున మండల స్థాయిలో ఉత్తమ పారిశుధ్య కార్మికునిగా కలెక్టర్‌తో సన్మానం పొందిన నేపథ్యంలో వీరరాఘవులును అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతల వెంకట సీతరామయ్య, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు, లగడపాటి వెంకటేశ్వర్లు, నల్లపునేని కొండ, మాదినేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (కె319) నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు, ఎపి ఫైబర్ నెట్‌వర్క్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు షేక్ జానీ షరీఫ్, కార్యదర్శి చిన్న బుజ్జీ, కోశాధికారి దుర్గారావు పాల్గొన్నారు.

సంక్రాంతి సీజన్లో ఆర్‌టిసికి లాభాలు

ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ

సంక్రాంతి సీజన్‌లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపటం ద్వారా ఆర్టీసీకి మంచి లాభాలు వచ్చాయని ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమలరావు వెల్లడించారు. అవనిగడ్డ ఏపీఎస్ఆర్టీసీ డిపోను గురువారం ఆయన సందర్శించారు. డిపోలోని కార్యాలయంతోపాటుగా ప్రాంగణాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ హనుమంతరావు నుండి పలు వివరాలు తెలుసుకోవడంతో పాటు కార్మికులను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా ఎండి విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం ఒక్కరోజులోనే రికార్డు స్థాయిలో రూ.23 కోట్లు ఆర్టీసీకి ఆదాయం లభించిందన్నారు. ఇప్పటివరకు రూ.21.55 కోట్లు ఆర్టీసీ అప్పులు గత ఆర్థిక సంవత్సరం అర్జించిన రూ 122 కోట్ల ఆదాయాన్ని ఈ ఏడాది డిసెంబర్ నాటికే అధిగమించినట్లు చెప్పారు. ఉద్యోగులకు రూ.966 కోట్లు, పిఎఫ్ బకాయిల్ని రూ.269 కోట్ల సిసిఎస్ బకాయిల్ని తీర్చినట్లు చెప్పారు. డిపో ఆదాయాన్ని పెంచేందుకు కృషిచేస్తున్న డిఎం హనుమంతరావును అభినందించారు. టిడిపి నాయకులు ఎండీకి పలు సమస్యలు పరిష్కారానికి కషి చేయాల్సిందిగా విపతిపత్రాన్ని అందజేశారు. యవలసిందిగా తెలుగుదేశం పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు డిపో సందర్శనకు వచ్చిన ఎండిని కలిసి అవనిగడ్డ బస్టాండ్ లోని రోడ్డు మరమ్మతులు చేయాలనీ, అవనిగడ్డ నుండి చెన్నై బెంగళూరు విశాఖపట్నం లకు బస్సు సౌకర్యం కల్పించాలనీ,నాగాయలంక నుండి చీరాల వెళ్లే బస్సును మరల పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా వినతి పత్రంలో కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, బండే రాఘవ, భావదేవర పల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఘంటసాల రాజమోహనరావు, యలవర్తి చిన్న, బర్మా శ్రీనివాసరావు గుడివాక నరహరి, ఆవుల వెంకకృష్ణారావు, పేటిటి శ్రీను, రేపల్లె అంకినీడు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులు కూడా ఎండిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రధాన రహదారికి వచ్చే రహదారికి నిధులు మంజూరు చేయించి సిసి రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, ఎంపీటీసీ బొప్పన భాను తదితరులు పాల్గొన్నారు. నతి పత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలి

ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కష్ణా)

మాండూస్ తుఫానుతో జిల్లాలో దెబ్బతిన్న వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలోనూ, రంగు మారిన ధాన్యాన్ని 25 శాతం వరకు నిబంధనలు సడలించి మద్దతు ధర ఇప్పించాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు.

డిఆర్‌ఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కౌలురైతుసంఘం నాయకులు

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఇటీవలకాలంలో అకాల వర్షాలు, మాండూస్ తుఫాను సమయంలో దెబ్బతిన్న ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని కానీ క్షేత్ర స్థాయిలో ఎక్కడ ఆ విధంగా జరగటం లేదన్నారు. గ్రామాల్లో పాయి వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు తమ ఇష్టాను సారంగా శాతాన్ని ఎక్కువగా చూపించి రూ.900 లేదా రూ.1000కు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.రామాంజనేయ ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు శీలం నారాయణరావు, బి.వి.శ్రీనివాసరావు, నాయకులు ఎం.సురేష్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు వి.మరియదాసు, కె.బక్కయ్యలు ఉన్నారు.

25 నుంచి కార్తికేయని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-మోపిదేవి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవిలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఏసి ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. వైదిక కార్యక్రమాలతో పాటు ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయంలో నిత్య ఆర్జిత సేవలు నిలిపివేయునట్లు ఆయన తెలిపారు. 25న శ్రీ స్వామి వారిని పెండ్లి కుమారుని చేయటం, 26న శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, ఎదురుకోలు ఉత్సవం, దివ్య కల్యాణ మహోత్సవం, అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవం, 27న స్వామి వారి రథోత్సవం, 28న వసంతోత్సవం, స్నానో ఉత్సవం, శమీ వృక్ష పూజ, మయూర వాహనంపై గ్రామోత్సవం, 29న సుబ్రహ్మణ్య వాహనం ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ స్వామివారి పుష్ప సయ్యలంకృత, పర్యవంక సేవ వంటి పూజా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు : చంద్రబాబు

ప్రజాశక్తి-పెదపారుపూడి

నిరంతరం పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకే గుర్తింపు ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని తాడేపల్లిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకురాలు నత్తా వాణి చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్యకర్తలకూ ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. మళ్లీ తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. దానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు.

చంద్రబాబునాయుడుతో నత్తా వాణి

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను కాపాడాలి : పురేంద్ర

మాట్లాడుతున్న డిటిసి పురేంద్ర

ప్రజాశక్తి-గన్నవరం

రోడ్డు ప్రమాదానికి గురైన వారిని తక్షణమే ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిటిసి పురేంద్ర అన్నారు. గురువారం గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వాహన యోగ్యత పటుత్వ కేంద్రంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో, లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. దీనికి కేంద్రం ఇంచార్జి ప్రవీణ్ అధ్యక్షత వహించారు. డిటిసి పురేంద్ర మాట్లాడుతూ రోడ్డుపై ప్రమాదాలు జరగడం సహజమనే, ప్రమాదానికి గురైన వారిని చూసి వెళ్లిపోకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్చడం మంచి పనిగా భావించాలన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లటం వల్ల పోలీసు వారు ఇబ్బంది పెడతారని భావన ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. దీనిపై కేంద్రం గుడ్ సిటిజన్ అనే నూతన చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దానిలో పోలీసులు గానీ, ఆసుపత్రి యాజమాన్యం కానీ క్షతగాత్రుడ్ని తీసుకొచ్చిన వారి వివరాలు అడగకూడదని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఎవరైనా ఇష్టముంటే తమ వివరాలు వారికి చెప్పవచ్చు అన్నారు. రోగి ప్రాణాలు కాపాడడం చాలా ఇంపార్టెంట్ అనే విషయాన్ని గమనిస్తే బాగుంటుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. వాహనదారులకు వాహన ఇన్సూరెన్స్ పై అవగాహన కల్పించటం, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాంబశివరావు వాహన బీమా చేసే విధానం, పరిహారం పొందే విధానాన్ని గురించి వివరించారు. డాక్టర్ జి.క్రాంతి, డాక్టర్ కె.శిరీష గన్నవరం సిహెచ్‌సి నుంచి పాల్గొన్నారు. గన్నవరం ఎఫ్‌సి స్టేషన్ ఇన్‌ఛార్జి ఆర్.ప్రవీణ్ రహదారి భద్రతా చట్టాలు, గుడ్‌సిటిజన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు రాంబాబు, డి.వి.రమణ, కె. వెంకటేశ్వరరావు, జి వి ఎస్ మూర్తి, ఎఎంవిఐ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లంతా కంటి పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

40 సంవత్సరాలు పైబడిన డ్రైవర్లంతా తప్పకుండా విధిగా కంటి పరీక్షలు చేపించుకోవాలని జిల్లా రవాణా అధికారి పి.సీతాపతిరావు సూచించారు. 34వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం కృష్ణాజిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని సిరి కళ్యాణ మండపంలో విద్యాసంస్థల బస్సుల డ్రైవర్లకు డాక్టర్ల పర్యవేక్షణలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాపతిరావు మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ వారి సూచనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. మొత్తం 200 మంది డ్రైవర్లు వైద్యుల సూచనలు, సలహాలు పొందారాన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి కె.రమేష్‌బాబు, వైద్యులు శిరీష, డి.దివ్య రవళి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండిఎల్ సిద్ధిక్, బిఎస్ఎస్ నాయక్, డి.సోనీ ప్రియా పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్ వేమూరి వెంకట్రావుకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి

ఎఎంసి చైర్మన్ వేమూరి వెంకట్రావును సత్కరిస్తున్న ప్రతినిధులు

ఘంటసాల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా ఎంపికైన ఘంటసాల మండల వైసీపీ అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, డైరెక్టర్ మెండు కొండలును చల్లపల్లి మండలం వక్కలగడ్డ పంచాయతీ వద్ద సర్పంచ్ వల్లూరి ఉమా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఘంటసాల జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సచివాలయ పార్టీ కన్వీనర్ ఆకురాతి భాస్కరరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, అభిమానులు, స్థానిక సర్పంచ్ ఉమా, పిఎసిఎస్ చైర్‌పర్సన్ హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మురాల సాయి, పంచాయతీ కార్యదర్శి పి.రాంబాబు, దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - గుడివాడ

మొబైల్ ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని నందివాడ మండల పరిషత్ అభివద్ధి అధికారి బివై విష్ణు ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నందివాడ మండలంలో ఈనెల 20న తుమ్మలపల్లి, 21న రుద్రపాక, 23న అరిపిరాల, 24న తమిరిశ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేశామన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం ఆర్టీసీ డిపోలో శుక్రవారం 11 నుంచి 12.00 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. గన్నవరం పరిసర ప్రాంత ప్రయాణీకులు వారి సలహాలు, సూచనలు, సమస్యలను చరవాణి : 8790996090కి తెలియజేయాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ పోలీసు కమిషనర్'

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం 'డయల్ యువర్ పోలీస్ కమిషనర్' కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 11 నుండి 12 గంటల మధ్య ఫోన్ నెంబర్ 0866-2490613 కు డయల్ చేసి పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాతో ప్రజలు నేరుగా మాట్లాడి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సేవలను వినియోగించుకోండి : ఎస్‌పి జాషువా

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : కృష్ణాజిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సేవలను వినియోగించుకోవాలని ఎస్‌పి పి.జాషువా సూచించారు. వివిధ రకాల కారణాలతో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుల నుండి ఫిర్యాదు స్వీకరించిన వెంటనే మొబైల్ ఫోన్ ట్రేస్ చేసి బాధితులకు అందజేయడానికి ఆయన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు ఓ నూతన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు.

ఉపయోగించే విధానం

పోగొట్టుకొన్న మొబైల్ ఫోను తిరిగి పొందాలనుకుంటే కృష్ణాజిల్లా పోలీస్ శాఖ రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. 9490617573 అనే నెంబర్ వాట్సప్‌కు HI అని మెసేజ్ పంపగానే ఒక లింక్ వస్తుంది. ఆ లింకును క్లిక్ చేసిన వెంటనే ప్రశ్నల రూపంలో తయారు చేసిన వాటిలో వివరాలు నమోదు చేయాలి. ఆ వివరాలన్నీ మిస్సింగ్ మొబైల్ ట్రాకర్ ఆప్‌కు చేరుతాయి. దీంతో మీ మొబైల్‌ను ట్రేస్ చేయడం కృష్ణాజిల్లా పోలీసుల బాధ్యతగా ఉంటుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్‌పేట సెక్షన్, సిటీ సబ్ స్టేషన్, 11 కెవి అరండల్ పేట ఫీడర్, 11 కెవి అన్నదాన సమాజం రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిసిపిడిసిఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. అన్నదాన సమాజం రోడ్డు, గోగవారి స్ట్రీట్, దాసువారి స్ట్రీట్, మసీద్ స్ట్రీట్, రెహమాన్ స్ట్రీట్, కోదండరామిరెడ్డి స్ట్రీట్, మల్లాదివారి రోడ్డు, రామ చంద్రరావు రోడ్డు, రామ మందిరం రోడ్డు, శేషాద్రి శాస్త్రి స్ట్రీట్, కాళేశ్వరరావు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన ఇంటెలిజెన్స్ సిబ్బంది శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : ఇంటిలిజెన్స్ సిబ్బంది శిక్షణ గురువారం ముగిసింది. అన్ని జిల్లాల్లోని ఇంటిలిజెన్స్ సిబ్బందికి ఏలూరు డిటిసిలో శిక్షణ ఇచ్చారు. పోలీస్ కానిస్టేబుల్ స్థాయి నుండి ఆర్ఎస్ఐ స్థాయి వరకు 45 మంది హాజరయ్యారు. మొదటి సారిగా 8 మంది మహిళా సిబ్బందిని బాంబ్ డిస్పోసల్ టీంలోకి తీసుకున్నారు. ఆరు వారాలపాటు సాగిన ఈ శిక్షణ అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ఎంజి రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ తీసుకున్న సిబ్బంది తయారు చేసిన ఐఇడి నమూనాలను పరిశీలించి వాటి వివరాలను, శిక్షణ గురించి సిబ్బంది నుండి అడిగి తెలుసుకున్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన సిబ్బందికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిపి కాంతి రాణా టాటా మాట్లాడుతూ. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఒఎస్‌డి/ఐజిపి, ఐఎస్‌డబ్ల్యు శశిధర్ రెడ్డి (రిటైర్డు ఐపిఎస్), సిఎం సెక్యూరిటీ వింగ్ ఎస్‌పి సి.హెచ్.అప్పలనాయుడు, ఎస్‌పిలు ఐఎస్‌డబ్ల్యు సూర్యభాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్య స్వామి పాల్గొన్నారు.

ఇంట్లో దోపిడీ ఘటనలో ఇద్దరు అంతర్‌జిల్లా గొంగల అరెస్టు

రూ.25 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్‌పేట గోపాల్ రెడ్డి రోడ్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో అంతర్ జిల్లా నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు రూ.25 లక్షల విలువైన 672 గ్రాముల బంగారు, 11 కిలోల 842 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు క్రైమ్ ఎడిసిపి పి.వెంకట రత్నం పర్యవేక్షణలో సిసిఎస్ ఎసిపి చలసాని శ్రీనివాస రావు, సౌత్ ఎసిపి డాక్టర్ బి.రవి కిరణ్ నేతృత్వంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్లు పి. కృష్ణ, బి.హెచ్.వెంకటేశ్వర్లు, గవర్నర్ పేట ఇన్స్పెక్టర్ డి.సురేష్ తమ సిబ్బందితో కలిసి పలు బృందాలుగా ఏర్పడి విచారించారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివాలయం వీధిలో అనుమానంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు చెప్పిన సమాచారం మేరకు పాత ప్రభుత్వాస్పత్రి వద్ద మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు రూ.25 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నిందితులు విజయనగరం జిల్లా రాజాం కస్పావారి వీధికి చెందిన వంతరం శివ కిషోర్ అలియాస్ చోటు భాయ్ అలియాస్ శివ, విశాఖపట్నం గోపాలపట్నం హైస్కూల్ సమీపంలోని బలివాడ రమేష్‌గా గుర్తించారు. వీరిపై గతంలోనే పలు కేసులు నమోదై ఉన్నాయి. నిందితులిద్దరూ బంధువులే. శివ కిషోర్ గతంలో పలు దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. రమేష్‌పై ఒక హత్య కేసు ఉంది.

పోలీసు పరీక్ష పేపర్ల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 22న జరిగే కానిస్టేబుల్ పరీక్షా పత్రాలను భద్రపరచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం అడ్మిన్ డిసిపి మొకా సత్తిబాబు పరిశీలించారు. ఎపి స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు (ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి) పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని స్ట్రాంగ్ రూములను, పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. నగరంలోని వి.ఆర్.సిద్దార్ధ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, సిసిటివి కెమెరాల ఏర్పాటు, పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్ ఏ.వి.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేమనను స్మరించుకున్న అడ్మిన్ డిసిపి

అడ్మిన్ డిసిపి మోకా సత్తిబాబు గురువారం యోగివేమన జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఎన్‌టిఆన్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్తిబాబు మాట్లాడుతూ. తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో వేమన తనదైన ముద్ర వేసిన మహనీయుడన్నారు. సమాజంలోని మూఢాచారాలను నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఒ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆర్‌యుబి రోడ్డు మరమ్మతులు పూర్తి

వివిధ రూపాల్లో సుదీర్ఘ పోరాటం జరిగిన పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - విజయవాడ : అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం కారణంగా సింగ్‌నగర్ ఫ్లైఓవర్ పక్కన గల ఆర్‌యుబి రోడ్ మరమ్మతులకు 18 నెలల సమయం పట్టిందని పౌర సంక్షేమ సంఘం 59వ డివిజన్ కారదర్శి అవనిగడ్డ పున్నారావు పేర్కొన్నారు. ఎట్టకేలకు అధికారులు ఈనెల 10న మరమ్మతులు ప్రారంభించి పూర్తి చేశారని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభంకానున్న ఈ రోడ్డు మర్మతుల కోసం వివిధ రూపాల్లో సుదీర్ఘంగా పోరాడాల్సి వచ్చిందన్నారు. సమస్య అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే స్పందించడంలేదని, అలసత్వం ప్రదర్శిస్తూ నిర్లక్ష్యం వహిస్తూ కుంటి సాకులు చెప్పే పరిస్థితి నెలకొందన్నారు. ఏదేమైనా రోడ్డు మరమ్మతులను పూర్తి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పూర్తయిన రోడ్డు మరమ్మతులు

మొదటి పేజీ తరువాయి

అవనిగడ్డలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

ఎల్ఐసి ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించాలి

ధరించి ప్రతిజ్ఞ చేశారు. కొవ్వొత్తులతో నిర్వహించిన ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీలోని రెండు ఎల్ఐసి కార్యాలయాల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ "ప్రజల ధనం.. ప్రజల కొరకే' అన్న నినాదంతో నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసి పరిరక్షణకు ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. అవనిగడ్డ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో నేతలు మాట్లాడుతూ ప్రజల సొమ్ముకు భద్రత కల్పించాలనే ధ్యేయంతో 1956 జనవరి 19న 1956లో అప్పటి జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వం 245 ప్రైవేటు సంస్థలను జాతీయం చేసిందని గుర్తుచేశారు. అనంతరం 1956 సెప్టెంబర్ 1న పార్లమెంట్లో ప్రత్యేక చట్టం ద్వారా ఎల్ఐసిని ఏర్పాటు చేశారని వివరించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎల్ఐసి అనేక సవాళ్లను ఎదుర్కొని ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సుకే అన్న లక్ష్యంతో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. పాలసీలు, ప్రీమియం ఆదాయం సేకరణలో దేశంలో ఇప్పటికీ ఎల్ఐసినే అగ్రగామిగా ఉందన్నారు. గత 67ఏళ్లుగా ప్రజల విశ్వాసాన్ని చూరగొని రూ.100 కోట్ల ప్రభుత్వ పెట్టుబడికి లాభాల్లో భాగంగా ప్రతి ఏడాది సుమారుగా రూ.31 వేల కోట్లను డివిడెండ్‌గా ప్రభుత్వానికి చెల్లిస్తోందన్నారు. అన్ని పంచవర్ష ప్రణాళికల్లో తన వంతుగా సింహ భాగాన్ని (లక్షల కోట్లను) అందించి ప్రపంచవ్యాప్తంగా అత్యున్నతమైన సేవలందిస్తోందని తెలిపారు. తద్వారా లాభాలతో దాదాపు 95 శాతం పాలసీదారులకు బోనస్ అందిస్తోందన్నారు. నేడు ఎల్ఐసి ఫండ్ దాదాపుగా రూ.35 లక్షల కోట్లు ఉండగా, దానిని కేంద్రం రూ.11 లక్షల కోట్లు (కేవలం మూడో వంతు మాత్రమే) చూపి ఇన్షియల్ పబ్లిక్‌ఆఫర్ (ఐపిఒ) పేరుతో షేర్ మార్కెట్లో ప్రవేశపెట్టి నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎల్ఐసిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించటం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి చేటు తెస్తుందన్నారు. బీమా రంగ జాతీయీకరణ లక్ష్యాలకు విఘాతం కలిగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని బీమా, బ్యాంకింగ్ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రజలందరిపైనా ఉందని అన్నారు. మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమానికి నాయకులు జె.సుధాకర్, జి.కిషోర్ కుమార్, ఎల్.రాజశేఖర్, వి.ఆర్.ఎన్.ఠాగూర్. బి. శ్రీనివాస్, ఎస్.వి.రత్నారావు, ఎ.శ్రీనివాసరావు, బిహెచ్.మాధుర్, ఎంవైవిఎస్ఆర్. సుబ్రమణ్యం, వై.స్వామినాథ్ తదితరులు నేతృత్వం వహించారు. విజయవాడలో జరిగిన ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి ఎన్.ఎం.కె.ప్రసాద్, భవానీపురం శాఖ కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, అధ్యక్షులు వి.వి.ఎస్.ఎస్.సాయి, ఆర్.వి.శ్రీనివాసరావు, కార్యదర్శులు గుర్రం శ్రీనివాస్, రాజశేఖర్, రెండు కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అవనిగడ్డలో ఎఐఐఇఎ, ఐసిఇయు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు టి చంద్రపాల్, ఎఎస్ఎం.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, వైవి రమణమూర్తి, బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమాజాన్ని జాగృతం చేసిన వేమన

ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మట్లాడుతూ 17వ శతాబ్దం నాటి వేమన రచనలను, పద్యాలను 20వ శతాబ్ధంలో కూడా గుర్తుచేసుకుంటున్నామంటే వాటికి ఉన్న విలువలను నేటి తరం గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజా కవి, సంఘసంస్కర్త యోగి వేమన సామాన్య పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో రచించిన పద్యాలు సామాజిక చైతన్యానికి ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ఆయన రచించిన పద్యాలు సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చాయన్నారు. ఆయన రచించిన ఒక్కో పద్యం ఒక్కో గొప్ప సందేశం ఇస్తుందన్నారు. నాలుగు పంక్తుల్లో రచించిన పద్యంలో పూర్తి సారాంశాన్ని వివరణను నీతిని బోధిస్తాయన్నారు. వేదాంత సారాన్ని చిన్న పద్యంలో పొందుపరచి పామరులకు అర్థమయ్యే రీతిలో ప్రబోధించి ప్రజా కవిగా ముద్ర వేసుకున్నారన్నారు. ప్రతిరోజూ ఒక వేమన పద్యాన్ని పఠనం చేయాలని సూచించారు. అనంతరం వేమన శతకంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4 వేలను కలెక్టర్ డిల్లీరావు వ్యక్తిగతంగా అందించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు వేమన శతకం పుస్తకాలు, ప్రశంసా పత్రాలను భాషా సంఘం విజయబాబు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి, ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వివి.కృష్ణంరాజు, అధికార భాషా సంఘం సభ్యులు జి.రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి

300 ఏళ్ల క్రితమే మానవుల్లో ఉన్న పెడధోరణులను చమత్కార దృష్టితో మూఢత్వానికి, కుల తతత్వానికి వ్యతిరేకంగా మనుషులంతా కలిసిమెలిసి జీవించాలని తన పద్యాల ద్వారా సాధారణ మానవులకు అర్థమయ్యే రీతిలో వేమన రచనలు చేయడం గొప్ప విషయమన్నారు. వేమన రచనలను సి.పి.బ్రౌన్ ఆంధ్రాంతా తిరిగి వాటిని లిఖితం చేయడం అభినందనయన్నారు. 'అల్పుడెపుడు పల్కు' అన్న పద్యంలో చెప్పినట్లు ఈనాడు ప్రజలను పీక్కుతినే వారు కూడా తాము ప్రజలకోసమే పుట్టామని, బతుకుతున్నామని చెబుతున్నారని, కానీ ఆచరణలో ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. దీన్ని ప్రజలంతా అర్థం చేసుకోవాలన్నారు. వేమన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా ప్రజలను అన్ని విధాలా చైతన్యం చేయగలమన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రాల బాధ్యులు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఆఖరుకు వేమనను కూడా ఒక యోగిగా మార్చారని అన్నారు. 300 ఏళ్ల క్రితమే ప్రజల జీవితాల్లో అన్ని పార్శ్వాలనూ తడిమి తప్పును తప్పుగా, ఒప్పును ఒప్పుగా వేమన తన శతకాలలో ఎత్తిచూపారని పేర్కొన్నారు. వాటిని చదివితే ఇప్పుడు జరుగుతున్న వాటిని చూసి చెప్పాడా అన్నట్లు ఉంటాయన్నారు. ఆనాడే సామాజిక రుగ్మతలను సూటిగా ఎత్తి చూపారని, వాటిని ముందుకు తీసుకు వెళ్ళగలిగితే చెడుమీద చేసే ఒక పెద్ద పోరాటంగా ఉంటుందని అన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రజల సాహిత్యాన్ని సాధారణ మానవుల నోళ్లలో నిరంతరం పాడుకునేలా చేసిన గొప్ప ప్రజాకవి వేమన అని అన్నారు. వేమన సాహిత్యం ఎక్కడా లిఖించబడలేదని, ఆయన పాడుకునే పాటలు, పద్యాలను అందరూ పాడుకుంటుంటే దాన్ని లిఖితంచేసిన గొప్ప వ్యక్తి సి.పి.బ్రౌన్ అని కొనియాడారు. జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు సునీల్ నరేన్ మాట్లాడుతూ వేమన సాహిత్యం మూఢాచారాలను, దురాచారాలను ఎండగట్టేదిగా ఉంటుందన్నారు. పాలకుల దోపిడీని ఎలా అర్థం చేసుకోవాలో వేమన పద్యాల్లో ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో వేమన పద్యాలను విస్తృతంగా ప్రచారంలోకి తేవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు టి.క్రాంతికిరణ్, పి.విజయ, జగదీష్, డివైఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్రప్రభుత్వం ఇంటింటికి సంక్షేమ పథకాలు అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోయిస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి

బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రమేష్ బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలోని వేకనూరు గ్రామం సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.శైలజ కుమారి, ఎంపిటిసి ఓర్రె నరేష్‌బాబు, గ్రామ పార్టీ కన్వీనర్ తుంగల వేణుగోపాలస్వామి, తుంగలవారిపాలెం సర్పంచ్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు

రాధాకృష్ణమూర్తి మృతికి సంతాపం

ప్రజాశక్తి పెదపారుపూడి

మండలంలోని యలమర్రు గ్రామ ఉప సర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ తండ్రి రాధాకృష్ణ మూర్తి మృతిచెందారు. ఆయన భౌతిక కాయాన్ని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా , మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), మండల కార్యదర్శి మసిముక్కు రాంబాబు, చెరుకూరి విజయ్‌కుమార్, గారపాటి నాగబాబూరావు, శివరామకృష్ణప్రసాద్, కలపాల కిషోర్, మండల,గ్రామ స్థాయి నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

జెడ్‌పి ఉన్నత పాఠశాల నిర్వహణ సంతృప్తికరం : శ్యామ్‌సుందర్

ప్రజాశక్తి-గన్నవరం

పాఠశాలల రాష్ట్ర పరిశీలకులు ఆర్.శ్యాంసుందర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లనపల్లిలో మనబడి, నాడు-నేడు మొదటిదశలో కల్పించిన సౌకర్యాలను గురువారం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ఉపాధ్యాయులతో టీచర్ డైరీలు, లెసన్ ప్లాన్లు సి,డి గ్రేడ్ విద్యార్థులకు నిర్వహించాల్సిన ప్రత్యేక తరగతులకు ప్రణాళికలను సిద్ధం చేసుకొనడానికి తగు సూచనలు చేశారు. జగనన్న గోరుముద్ద మెనూ పరిశీలించి నిర్వహణ తీరును అభినందించారు. పాఠశాల పచ్చదనం, పరిశుభ్రత నిర్వహణలో ప్రధానోపాధ్యాయులను ప్రశంసించారు.

క్విజ్‌లో మొవ్వ విద్యార్థినులకు తృతీయ బహుమతి

ప్రజాశక్తి - మొవ్వ

జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ ,విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మొవ్వ వివిఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్దినులు పి.వాణి,పి.మాధవిలు తృతీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాధవి తెలిపారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.వి.విజయబాబు సమక్షంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీ రావు చేతులమీదుగా తమ విద్యార్థినులు తతీయ బహుమతికి గాను మూడువేల రూపాయల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్నారన్నారని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా బహుమతి సాధించిన విద్యార్థినులను ఆమె అభినందించారు.

భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫ రెన్స్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ తో కలసి పాల్గొన్నారు. రీసర్వే, భూహక్కు పత్రాల పంపిణీ, స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం పనులు, ఈ-క్రాప్ నమోదు, పీఎం కిసాన్ ఈకేవైసీ, మైక్రో ఇరిగేషన్, జగనన్న పాలవెల్లువ, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, స్వయం సహాయక సంఘాల ఋణాలు తదితర అంశాలపై ఆయన కలెక్టర్లతో సమీక్షించారు. డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, మచిలీపట్నం మున్సపల్ కమీషనర్ చంద్రయ్య, ఏడీ సర్వే గోపాల్రాజా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, హౌసింగ్ ఇన్చార్జి పీడి జివి.సూర్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ డీడి కె.సరస్వతి, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖాధికారి దూరేటి ఫణి, డిఇఓ తహేరా సుల్తానా, డిసిఓ పి.వి. ఫణికుమార్, సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డా.ఏ. శేఖర్ ఇతర అధికారులు కలెక్టర్ తో పాటు పాల్గొన్నారు.

జూదక్రీడలపై ఉక్కుపాదం మోపాం : ఎస్‌పి

మచిలీపట్నం అర్బన్ : జిల్లా పోలీసులు ఎక్కడా నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి ప్రదర్శించలేదని జిల్లా ఎస్పీ పి జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని చట్ట వ్యతిరేక జూద కార్యకలాపాలపై పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపిందన్నారు. పలు ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల వేదికగా పోలీసుల నిర్లక్ష్య వైఖరి అని చేస్తున్న ప్రచారాలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయక క్రీడల మినహా జూద కార్యకలాపాలపై ఎక్కడికక్కడ మెరుపు దాడులు చేసి కేసుల నమోదు చేశామని చెప్పారు. జూద కార్యకలాపాల నివారణకు ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి మైక్ ప్రచారాలు నిర్వహించామన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యువకులకు ఫుట్బాల్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపామన్నారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి సంక్రాంతి పండుగలో పోలీసు శాఖతో పాటు భాగస్వామ్యం చేశామన్నారు. పోలీసు యంత్రాంగం. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమలు పర్చామన్నారు. స్థల యజమానులు, నిర్వాహకులను పిలిపించి నోటీసులు అందజేశామన్నారు. గతంలో జూద కార్యకలాపాలలో పాల్గొన్న వారిపై ప్రత్యేక నిఘాని ఏర్పాటు చేసి ముందస్తు బైండోవర్ చేశామన్నారు. చట్ట వ్యతిరేక జూద కార్యకలాపాల నిర్వహణకు సిద్ధం చేసిన బరులను గుర్తించి ఎక్కడికి అక్కడ ధ్వంసం చేసి, సిద్ధం చేసిన టెంట్లని పీకి స్థలాలను చదును చేశారని పేర్కొన్నారు.కోడి పందాలపై 213 కేసులలో 562 మందిని, రూ.2,24,060 నగదు, 245 కోడిపుంజులు, 241 కోడి కత్తులు, రెండు వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. పేకాటలలో 301 కేసులు నమోదుచేసి, 876 మందిని, రూ.7,02,171 నగదుతో పాటు మూడు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. అంతే కాదు గహాలలో నిర్వహించిన జూదలపై మూడు కేసులు నమోదు చేసి 47 మందితో, రూ.2,53,780 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.

100 రోజులు పని కల్పించాలి

గుడివాడ : రాబోయేకాలంలో జాబ్ కార్డు కలిగిన వారందరికీ 100 రోజులు పనికల్పించాలని ఎంపిడిఒ బి.వై.విష్ణుప్రసాద్ ఆదేశించారు. గురువారం నందివాడ మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని అయా గ్రామాల్లో పనులను గుర్తించి త్వరితగతిన చేపట్టాల్సిందిగా కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, అన్ని గ్రామాల ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వెలివోలులో ఇల్లు దగ్ధం

చల్లపల్లి : మండల పరిధిలోని వెలివోలు గ్రామానికి చెందిన బొల్లా శ్రీనివాసరావు పూరిల్లు విద్యుత్ ఘాతకంతో దగ్ధమైంది. గురువారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో రూ.1.85 లక్షల నగదు, 16 గ్రాముల బంగారం, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్న సమయానికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

లేఅవుట్లో విద్యుత్ సదుపాయం

గన్నవరం : ఉంగుటూరు మండలంలో లేఔట్లలో మౌలిక సదుపాయాలు సమకూరుస్తూ గృహాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడు గ్రామంలో జగనన్న లేఅవుట్లలోని 82 ప్లాట్లును సందర్శించారు. లేఔట్‌లో కరెంట్ సదుపాయం లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు లేఔట్‌లో కరెంట్ స్తంభాలు పాతించి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. దీర్ఘ కాలికంగా ఉన్న సమస్యను నెరవేర్చినందుకు జిల్లా కలెక్టర్ కు ధన్యవాదములు తెలిపారు.

విమానాశ్రయ భూ బాధితుల నిరసన

గన్నవరం : తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించకుండా ఎన్నాళ్లు ప్రభుత్వం తమను ఇబ్బంది పెడుతుందో చూస్తామని విమానాశ్రయ నిర్వాశితుల పోరాట కమిటీ నాయకులు తిరివీధి ఏసురత్నం అన్నారు. దావాజీగూడెం గ్రామంలో విమానాశ్రయ నిర్వాశితులకు న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరం గురువారం కొనసాగింది. ఏసురత్నం మాట్లాడుతూ పోరాటం చేయకుండా ప్రభుత్వం దిగొచ్చే పరిస్థితి లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో అందరికీ ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ప్రభుత్వం ఇల్లు కోల్పోయిన వారికి అద్దె డబ్బులు ఇవ్వకుండా, కొత్తగా ఇల్లు కట్టించి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అద్దె బకాయిలు చెల్లించడంతోపాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో గృహాల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున ఇవ్వాలని కోరారు. పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జోజి, సుబ్బారావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కె.పి.సారథితో మాట్లాడుతున్న వై.వి.బి.రాజేంద్రప్రసాద్ తదితరులు

ఎంఎల్ఎ పార్థసారథికి పరామర్శ

ప్రజాశక్తి - మొవ్వ

మాజీ ఎంపి కె.పి.రెడ్డయ్య ఇటీవల మతి చెందిన విషయం తెలిసిందే. ఆయన తనయుడు, పెనమలూరు ఎంఎల్ఎ కె.పార్థసారథి తోపాటు కుటుంబ సభ్యులను గురువారం పలువురు అధికార, అనధికార ప్రముఖులు పరామర్శించి సానూభూతి తెలిపారు. మాజీ ఎంఎల్‌సి వైవిబి రాజేంద్రప్రసాద్, పెడన నియోజకవర్గ టిడిపి నాయకులు కాగిత కృష్ణ ప్రసాద్, పామర్రు ఎంఎల్ఎ కైలే అనిల్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ అధ్యక్షులు నాగిరెడ్డి, విజయవాడ వైసిపి నేత బొప్పన భవకుమార్,పలువురు జెడ్పీటీసీలు, ఎంపిటీసి సభ్యులు, సర్పంచ్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కమలమ్మ జీవితం మహిళలకు ఆదర్శం : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం

సిపిఎం నాయకురాలు కమలమ్మ జీవితం ప్రతి మహిళకు ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. గురువారం గన్నవరం సొసైటీ పేటలో కామినేని కమలమ్మ

కమలమ్మకు నివాళులర్పిస్తున్న వై.నరసింహారావు, ఆర్.రఘు తదితరులు

సంస్మరణ కార్యక్రమం జరిగింది. వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు పాల్గొని ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమంలో భర్త చంద్రంతో పాటు కలిసి ముందుకు నడిచిన గొప్ప వ్యక్తి కమలమ్మ అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో పని చేయడం చాలా కష్టమని భావించిన నిషేధం రోజుల్లో కూడా ఆమె మొక్కవోని దీక్షతో ఇంటిపై ఎర్రజెండా ఎగురవేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, పటాన్ సర్దార్, ఉదయ భాస్కరరావు, నాగేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

300మందికి అన్నదానం

గుడివాడ : గుడివాడలో వెనిగండ్ల ఫౌండేషన్ ప్రారంభించిన అన్నా కాంటీన్ ద్వారా రెండోరోజు బంటుమిల్లి రోడ్డులోని చేపల మార్కెట్ వద్ద అన్న వితరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా 300మందికి ఉచితంగా అన్నవితరణ చేశారు. వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము మాట్లాడారు. నందమూరి తారక రామారావు స్ఫూర్తితో అన్న కాంటీన్‌లను పునరుద్ధరించామన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద భోజనాలు చేస్తున్న స్థానికులు

రెయిన్‌బోలో నవజాత శిశువుకు అత్యుత్తమ చికిత్స

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: నగరంలోని రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పటల్స్‌లో అతి తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువుకు పేస్‌మేకర్‌ను అమర్చి, తరువాత శిశువు గుండెకు ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ వైద్యులు డాక్టర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. నగరంలోని హాస్పటల్ కాన్ఫరెన్స్‌హాల్ నందు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ బరువు 900 గ్రాములతో పుట్టిన నవజాత శిశువుకు 3వ రోజున తాత్కాలిక పేస్‌మేకర్ ఆపరేషన్ చేశామన్నారు. రెండున్నర నెలల తరువాత పర్మినెంట్ పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్‌తో శిశువు గుండెకు ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కంజినటల్ హార్ట్ బ్లాక్‌తో పుట్టిన అతి తక్కువ బరువున్న బిడ్డకు పేస్‌మేకర్‌ను అమర్చడం ద్వారా తమ హాస్పటల్ అత్యుత్తమ చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ వైద్యుల పర్యవేక్షణలో చికిత్సను అందించడం ద్వారా బేబి 900 గ్రాముల నుంచి 3 కిలోలకు మెరుగుపడిందన్నారు. ఆ తరువాత శాశ్వత పేస్‌మేకర్‌ను శిశువుకు పెట్టినట్లు తెలిపారు. రెయిన్‌బో హాస్పటల్‌లో అన్ని రకాలైన పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండటం కారణంగానే శిశువుకు చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ భరత్ సిద్దార్థ, కన్సల్టెంట్ పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ శివ ప్రసాద్ పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో వంటావార్పు

ప్రజాశక్తి-మైలవరం: పేదల ఆత్మ గౌరవం పెరగాలంటే భూ పంపిణీయే పరిష్కార మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. మైలవరంలోని పేదలు సాగు చేస్తున్న అసైన్డ్ భూముల్లో గురువారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉంటే గౌరవం, విద్య, వైద్యం లాంటి సదుపాయాలు సమకూరుతాయని అన్నారు. 1973లో ఆమోదం పొందిందన్నారు. దున్నేవాడికే తినే వాడికే భూమి కావాలని నినాదంతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే భూ సంస్కరణ చట్టం వచ్చిందని, నేడు ఈ చట్టాన్ని తుంగలో తొక్కారని అన్నారు. కొంతమంది భూస్వాములు పేదల వద్ద ఉన్న భూమిని కబ్జా చేస్తుంటే పేదల పక్షాన ఉండాల్సిన ప్రభుత్వాలు వారికి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. పేదలకు భూమిపై హక్కు కల్పించే వరకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పానేం ఆనందరావు, భూ పోరాట కమిటీ సభ్యులు బుద్ధ యోహాను, వంగూరి లాజరు, సయ్యద్ జానీ శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని లేని రాష్ట్రంగా ఎపి : అయ్యన్న

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎపిని రాజధాని లేని రాష్ట్రంగా సిఎం జగన్ మార్చారని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. గురువారం నగరంలోని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి పలు కంపెనీలు తరలిపోతున్నాయన్నారు.

బ్రాందీ షాపులను తనఖా పెట్టి రూ.8,700 కోట్లు అప్పు తీసుకొచ్చారని విమర్శించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు దాక్కుని, ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ బయటకు వస్తున్నారని పరోక్షంగా కొందరు టీడీపీ నాయకులకు చురకలు అంటించారు. టీడీపీకి మొదట్నుంచి బడుగులే అండగా ఉన్నారని, టీడీపీ బీసీలకే పెద్ద పీట వేసిందని అన్నారు. త్వరలో టీడీపీ బీసీ నేతల సమావేశం జరుగుతుందని, మూడు ప్రాంతాల్లో బీసీ సదస్సులు పెడతామని తెలిపారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ బీసీలను దూరం చేసేందుకు కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, సరైన సమయంలో సమాధానం చెబుతామని అన్నారు. టీడీపీ, చంద్రబాబును విమర్శించే కొడాలి, జోగి వంటి వాళ్లని అడ్డుకున్నది బీసీలేనన్నారు. ఈ సమావేశంలో నాయకులు కామా దేవరాజు, కొట్టేటి హనుమంతరావు, ఉమ్మడి చంటి, పేరాబత్తుల రమణ, గుర్రం కొండ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : వెలంపల్లి

ప్రజాశక్తి-భవానీపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం స్థానిక 38వ డివిజన్‌లోని 194వ సచివాలయం పరిధిలో జరిగిన గడపగడపకూ కార్యక్రమంలో వెలంపల్లి మాట్లాడుతూ కొండ ప్రాంతం కావడంతో కొంత మెట్లు సమస్య వుందని, త్వరితగతిన అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. టిడిపి కార్యాలయాల్లో పేకాట శిబిరాలు నడుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రహమతున్నీసా, హయత్ షరీఫ్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఓ బాలికను అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుండనాల శేషమణి, గాదె ఆదిలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను వారు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత రాజరాజేశ్వరి పేటకు చెందిన ఓ బాలిక స్థానిక సుద్ద ఫ్యాక్టరీ వద్ద బుధవారం ఆడుకుంటుండగా ఓ వ్యాన్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడటం బాధాకరమన్నారు. రోజురోజుకూ మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని చట్టాలు వచ్చినా ప్రభుత్వం వాటిని కఠినంగా అమలు చేయడంలో విఫలమౌతుందని మండిపడ్డారు. గత నెల ఇదే ప్రాంతంలో ఏడు సంవత్సరాల బాలికపై అత్యాచార ప్రయత్నం చేసిన విషయం మరువకముందే మరో ఘటన చోటుచేసుకోవటం చాలా బాధాకరమన్నారు. చిన్న పిల్లలు అనికూడా చూడకుండా మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన కొందరు యువకులు మృగాల్లా పెట్రేగిపోతున్నారని మండిపడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వివి. లక్ష్మి, వి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీకాకుళం జిల్లాకు చెందిన మౌనిక, రాము దంపతులకు నెలలు నిండకుండా కేవలం 850 గ్రాముల బరువుతో పుట్టిన బాబు నోరి హాస్పటల్‌లో నందు చికిత్స పొందుతున్నాడు. సహాయం కోసం దీవెన ఫౌండేషన్ వారిని తల్లితండ్రులు ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గురువారం దీవెన ఫౌండేషన్ విజయవాడ పోలీసుల తరఫున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దీవెన ఫౌండేషన్ గ్రూప్ సభ్యులైన సింగ్‌నగర్ కానిస్టేబుల్ చందు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం : ఉదయభాను

ప్రజాశక్తి-వత్సవాయి: వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని గోపినేనిపాలెం గ్రామంలో రూ.17.65 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ గ్రామంలోని సొసైటీలో తక్కువ వడ్డీలతో రుణాన్ని పొందవచ్చుని తెలిపారు. పొదుపు సంఘాల్లో ఉన్న అక్కాచెల్లెళ్లకు ఈ సహకార సంఘాల ద్వారా 10 నుంచి 20 లక్షల వరకు రుణాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ముత్తినేని విజయశేఖర్, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బాణావతు శ్రీనివాసరావు, జడ్పిటిసి యేసుపోగు దేవమణి, ఎంపీటీసీ తేజవతు హుసేని, గాదేల రామారావు, రవి రాంబాబు, సామినేని లక్ష్మీనారాయణ, పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

22న సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: కృష్ణాజిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22 తేదీన జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి డి.దిలీప్‌కుమార్ తెలిపారు. ఎంపికైన జట్లు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో కడపలో జరుగనున్న రాష్ట్రస్థాయి సినీయర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 22వ తేదీ ఉదయం 7.30 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

రిపబ్లిక్ డే ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రిపబ్లిక్ డే సందర్భంగా ఈనెల 19 నుండి 26వ తేదీ వరకు రిటైలర్లు, కిరణా దుకాణాల వారి కోసం ఫ్లిప్‌కార్డు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు హెూల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్.ఎన్. ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ పొందని విదంగా ఆఫర్లు అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాలైన ఉత్పత్తులపై ఈఆఫర్లు వర్తిస్తాయని తెలిపారు. 74 రిపబ్లిక్ డీల్స్, బ్రాండ్ బిల్ బస్టర్స్ పేరుతో విక్రయాలు జరుగుతాయని తెలిపారు.

వైసిపిది అరాచక పాలన

మాజీ ఎంఎల్ఎ సౌమ్య

ప్రజాశక్తి-కంచికచర్ల: వైసిపి అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక అంబేద్కర్ కాలనీలో ఆమె ఇంటింటికీ పర్యటించారు. వైసిపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచక పాలన గురించి ప్రజలకు వివరిస్తూ చైతన్యపరిచారు. ముఖ్యమంత్రి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని అరాచకాలు చేయిస్తున్నారని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిపక్ష పార్టీల నాయకులను వ్యక్తిగతంగా దూషిస్తుంటే పైసాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక, మాజీ ఎంపిటిసి రొంపిచర్ల శ్యాం, నీలం శ్యామల, నాయకులు గుర్రం రామకష్ణ, వేమా వెంకట్రావు, గుత్తా రత్నం, బర్రె శంకరరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మంచి భోజనం, వసతులు కల్పించాలి

జిడిఎంఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-నందిగామ: జీడిఎంఎం ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం రాత్రి ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. మంచి భోజనం, వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు. బీటెక్, డిప్లమో, నర్సింగ్ కోర్సులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ రాకముందే ఫీజులు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి తెస్తుందని విద్యార్థులు తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో హాల్ టికెట్లు ఇవ్వకుండా బయటకు పంపడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌రావు, నందిగామ డివిజన్ కార్యదర్శి గోపి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు తక్షణమే హాల్ టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాశాలలో వసతులు కల్పించాలన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించాలన్నారు. పోలీసులు సంఘటన ప్రదేశానికి వచ్చి విద్యార్థి నాయకులతో చర్చలు జరిపి హాల్ టిక్కెట్లు ఇప్పించడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ జివి ప్రసాద్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టలేదని, ఫీజులు సకాలంలో చెల్లించాలని మాత్రమే అడిగామని తెలిపారు.

కళాశాల ముందు బైఠాయించిన విద్యార్థులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.